క్లుప్తంగా

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ రామారావు

జలుమూరు: ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ జెన్ని రామారావు అన్నారు. శుక్రవారం చల్లవానిపేట మన గ్రోమార్ సెంటర్‌ను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. అందుబాటులో ఉన్న ఎరువులకు సంబంధించిన బోర్డు పెట్టాలన్నారు. ఇతర ఎరువులకు ముడి పెట్టకుండా విక్రయించాలన్నారు. రైతులకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ఆర్ఐ కిరణ్ కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మెళియాపుట్టి: ప్రకృతి వ్యవసాయానికి ప్రతీ రైతు మారాలని ఒడిశాలోని పర్లాకిమిడికి చెందిన సెంచూరియన్ యూనివర్సిటీ అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థులు అన్నారు. శుక్రవారం మండలంలోని వసుంధర గ్రామంలో మినీ కాసాన్ మేళా నిర్వహించారు. రైతులకు ప్రకృతి సేద్యంపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథులుగా ఎంపీడీఓ నరసింహప్రసాద్ పండా, ఏఓ దానకర్ణుడు, ఎంఈఓ దేవేంద్రరావు హాజరయ్యారు. రసాయన ఎరువులు వాడటం వలన భూసారం తగ్గుతుందన్నారు. ఆయా పంటలు తినడం వలన అనేక అనారోగ్యాలు వస్తున్నాయన్నారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ ప్రకృతి ఎరువులను ఎలా వినియోగించాలో వివరించారు. సర్పంచ్ అప్పల నాయుడు, సలాన రాఘవరావు, ప్రకృతి వ్యవసాయం సభ్యులు పాల్గొన్నారు.

వేడుకలకు ఏర్పాట్లు పూర్తి



మార్కెట్ యార్డ్‌లో సభా ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

పాతపట్నం: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ ఎన్.ప్రసాదరావు, ఐటీడీఏ డీఈఈ శిమ్మయ్య, ఎంపీడీఓ చంద్రకుమారి తెలిపారు. శుక్రవారం సాయంత్రం పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మార్కెట్ యార్డుకు చేరుకుని, నిర్వహణ ఏర్పాట్లను అధికారులకు అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రభుత్వ అధికారులు, గిరిజన నాయకులు కృషి చేయాలన్నారు. ఉదయం 9 గంటలకు పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ప్రధాన జాతీయ రహదారి మీదుగా మార్కెట్ యార్డ్ వరకు ర్యాలీ నిర్వహించనున్నామని గిరిజన నాయకులు తెలిపారు.

శ్రీకాకుళం డివిజన్‌లో చేర్చాలని తీర్మానం



సమావేశంలో పాల్గొన్న ఎల్.ఎన్.పేట మండల వాసులు

హిరమండలం: ఎల్.ఎన్.పేట మండలాన్ని శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌లో విలీనం చేయాలని మండల వాసులు కోరుతున్నారు. రెవెన్యూ డివిజన్ల మార్పుపై రాష్ట్ర ప్రభుత్వ కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. శుక్రవారం స్థానికంగా ఓ కల్యాణ మండపంలో సమావేశమయ్యారు. రాజకీయాలకు అతీతంగా మండల వాసులు తీర్మానం చేశారు. మూడేళ్ల కిందట కొత్త జిల్లాల ఏర్పాటు సమయంలో శ్రీకాకుళం డివిజన్‌లో ఉన్న ఎల్.ఎన్.పేట మండలాన్ని టెక్కలి డివిజన్‌లో చేర్చారన్నారు. అప్పటి నుంచి కార్యాలయ పనులకు మండల వాసులు టెక్కలి వెళ్లాల్సి వస్తోందన్నారు. శ్రీకాకుళం వెళ్లి అక్కడ నుంచి టెక్కలి వెళ్లాల్సి రావడంతో వ్యయప్రయాసలకు గురవుతున్నామన్నారు. అందుకే గతంలో మాదిరిగా శ్రీకాకుళం డివిజన్‌లో కొనసాగేలా చేయాలని కోరారు.

మళ్లీ మొదటికొచ్చిన..
రేషన్ కష్టాలు..!



రేషన్ సరుకుల కోసం సారవకోట డిపో ఎదుట నిరీక్షిస్తున్న కార్డుదారులు

- రేషన్ డిపోలకు కీ రిజిస్టర్ల పంపిణీ
- కార్డుదారులకు తప్పని తిప్పలు
- వృద్ధులకు అందని ముందస్తు రేషన్ సరుకులు..

సారవకోట: కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు మళ్లీ రేషన్ కష్టాలు మొదలయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో ఎండీఎం వాహనాల ద్వారా రేషన్ సరుకులు గ్రామాలకు వెళ్లి ఇంటి వద్దే రేషన్ సరుకులు అందజేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎండీఎం వాహనాలను తొలగించింది. పాత పద్ధతిలో రేషన్ డిపోలకు వెళ్లి సరుకులు తీసుకోవాల్సి వస్తోంది. సుదూర ప్రాంతాల్లో ఉన్న రేషన్ కార్డుదారులు ఆయా రేషన్ డిపోలకు వెళ్లి ప్రతి నెలా వ్యయ, ప్రయాసలు పడాల్సి వస్తోంది. నరసన్నపేట నియోజకవర్గంలోని నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట మండలాల్లో 201 రేషన్ డిపోలున్నాయి. వాటి పరిధిలో 79,003 మంది రేషన్ కార్డుదారులున్నారు.

డిపో పరిధిలోని వారికే..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ కార్డుదారులు ఎక్కడ ఉన్నా.. బయోమెట్రిక్ యంత్రాల ద్వారా రేషన్ తీసుకోవచ్చని ప్రకటలు జారీ చేస్తున్నాయి. గ్రామ స్థాయిలో ఆ విధానానికి ప్రస్తుత కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. ఏ రేషన్ డిపోలో ఉన్న కార్డుదారులు ఆ రేషన్ డిపోలో మాత్రమే సరుకులు తీసుకునేలా రేషన్ డీలర్లకు కీ రిజిస్టర్లు పంపిణీ చేశారు. ఒక పెద్ద గ్రామంలో నాలుగు రేషన్ డిపోలున్నాయంటే వారి పేరు ఏ రేషన్ డిపో పరిధిలోని కీ-రిజిస్టర్లో ఉంటే అక్కడి నుంచి మాత్రమే సరుకులు తీసుకోవాలని నిర్దేశించింది. రేషన్ డీలర్లు కీ రిజిస్టర్‌లో ఉన్న పేర్లు మేరకు మాత్రమే సరుకులు అందిస్తున్నారు. మరొక డిపోకు వెళ్లినా సరుకులు ఇవ్వడం లేదు. దీంతో తక్కువ దూరంలో ఉన్న రేషన్ డిపో నుంచి సరుకులు తీసుకునే వెసులుబాటు లేకుండా పోయింది.

అరకొరగా రాగులు సరఫరా..

ఆగస్టులో రేషన్ కార్డుదారులకు బియ్యం, పంచధారతోపాటు రాగులు పంపిణీ చేశారు. రాగుల పంపిణీ అరకొరగా సాగడంతో కొంత మంది లబ్ధిదారులకు అందకుండా పోయాయి. ఒక కార్డులో ఒకే లబ్ధిదారుంటే 5 కేజీల బియ్యం అందజేస్తారు. బియ్యం ఒక కేజీ తీసుకోకపోతే.. ఒక కేజీ రాగులు సరఫరా చేశారు. అవి కూడా కొంత మంది లబ్ధిదారులకు మాత్రమే అందించారు.

ఇంటికి రేషన్ 10 శాతం మందికే..

ప్రతి నెలా 26 నుంచి 30వ తేదీ వరకు ముందు నెల రేషన్ సరుకులు వృద్ధుల ఇళ్లకు తీసుకెళ్లి సంబంధిత రేషన్ డీలర్ అందించాలి. ఈ విధానం రెండు, మూడు రేషన్ డిపోల్లో మాత్రమే అమలు అవుతోంది. 10 శాతం వృద్ధులు మాత్రమే వచ్చే నెల రేషన్ సరుకులు ముందుగా తీసుకుంటున్నారు. చాలా మంది రేషన్ డీలర్లు వృద్ధులకు రేషన్ సరుకులు ఇచ్చేందుకు కనీసం బయోమెట్రిక్ మిషన్లో లాగిన్ అయ్యే దాఖలాలు సైతం కనిపించడం లేదు.

నరసన్నపేట నియోజకవర్గంలో రేషన్ డిపోలు, కార్డుల వివరాలు..				
మండలం	జలుమూరు	నరసన్నపేట	పోలాకి	సారవకోట
డిపోలు	53	53	50	45
కార్డులు	18,817	23,134	20,886	16,166

రాగులు అందలేదు



ఈ నెలలో రేషన్ డిపోల ద్వారా రాగులు అందిస్తున్నారని తెలుసుకుని సారవకోట-3 రేషన్ డిపోకు వెళ్లాం. రాగులు అయిపోయాయని చెప్పి అందించలేదు. పూర్తి స్థాయిలో రాగులు అందించాల్సి ఉన్నా అరకొరగానే అందిస్తున్నారు.

– తూలుగు ఆనందరావు, రేషన్‌కార్డుదారుడు, సారవకోట

చర్యలు తీసుకుంటాం..



రేషన్ డిపోల పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. డిపోలకు సరఫరా అయిన రాగులున్నంత వరకు డీలర్లు సరఫరా చేశారు. వచ్చే నెల ఎక్కువ స్టాక్ వచ్చేందుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం. వృద్ధుల ఇంటికి తీసుకెళ్లి రేషన్ సరుకులు తప్పనిసరిగా అందించాలి. లేకపోతే చర్యలు తీసుకుంటాం.

– షరీఫ్, సీఎస్ డీటీ, సారవకోట

అధికారులు మరిచారు.. గ్రామస్తులు సంరక్షించారు..



రహదారులకు ఇరువైపులా ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రభుత్వ చేస్తున్నప్పటికీ.. వాటిని సంరక్షించే విషయంలో శ్రద్ధ చూపకపోవటంతో మొక్కలు కనిపించడం లేదు. మొక్కలు అందించడంలో ఉన్న శ్రద్ధ సంరక్షణపై అధికారులకు లేకపోవటంతో.. నాటిన మొక్కలు మూడు, నాలుగు రోజుల్లోనే మాయమైపోతున్నాయి. ఆమదాలవలస రూరల్ మండలం తమ్మయ్యపేట గ్రామంలో ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మొక్కల సంరక్షణ కోసం ప్రత్యేక శ్రద్ధ కనబర్చారు. మొక్కల చుట్టూ వస్త్రాలతో రక్షణ కల్పించారు.

– ఆమదాలవలస రూరల్

కోతకు గురవుతున్న రోడ్డు..



సారవకోట మండలంలోని జమచక్రం నుంచి సత్రాం పంచాయతీ గొల్లపేట వరకు ఇటీవల నిర్మించిన రహదారి పలుచోట్ల కోతకు గురౌతుంది. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఇటీవలే ఈ రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేశారు. ఈ మధ్య కురుస్తున్న వర్షానికి పలుచోట్ల రోడ్డుకు ఇరువైపులా ఉన్న బెర్ములు కొట్టుకుపోవడంతో రోడ్డు కోతకు గురవుతుంది. అవసరమైన చోట్ల కల్వర్టులు నిర్మించకపోవడంతో కొండల పైనుంచి వచ్చే వర్షం నీరు రోడ్డుకిరువైపులా ఉన్న మట్టి కొట్టుకుపోతుంది. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన రోడ్డు నిర్మాణ పనులు ఇష్టానుసారంగా చేపట్టడం, సంబంధిత అధికారుల పర్యవేక్షణ సైతం కొరవడంతో ఇటువంటి పరిస్థితి నెలకొందని పలువురు ఆరోపిస్తున్నారు.

– సారవకోట

చంద్రబాబు వైఫల్యాలను ఎండగట్టాలి



సుబ్బపేటలో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న చింతాడ రవికుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గం సమన్వయకర్త చింతాడ రవికుమార్

సరుబుజ్జిలి: సీఎం చంద్రబాబు మోసాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గం సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. మండలంలోని సుబ్బపేట, తురకపేట, పెద్దపాలెం, రొట్టవలస గ్రామాల్లో శుక్రవారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ, రికాలింగ్ మేనిఫెస్టో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ మోసాలను వివరించి క్యూ ఆర్ కోడ్‌ను అందించారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్‌తోపాటు అనేక హామీలను కూటమి నాయకులు ఇచ్చారని, వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. సంక్షేమ పథకాల్లో కూడా భారీగా కోత విధించారన్నారు.

ఎంతో మంది అర్హులకు అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలు అందలేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి సురవరపు నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కింజరాపు సురేష్, పార్టీ నాయకులు బద్రి రామారావు, పున్నపురెడ్డి తవిటినాయుడు, యడ్ల ఈశ్వరరావు, రావాడ రవికుమార్, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతం



కొత్తూరు: కొత్తూరులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్న మహిళలు

శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని ఆమదాలవలస, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల ప్రజలు వరలక్ష్మీ వ్రతాన్ని ఇళ్ల వద్ద భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామునుంచే ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక వ్రతాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



పాతపట్నం: పూజలు అందుకుంటున్న నీలమణి అమ్మవారు



జలుమూరు: శ్రీముఖలింగంలో వారాహి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



నరసన్నపేట: గీతా మందిరంలో వ్రతాలు చేస్తున్న మహిళలు



ఆమదాలవలస రూరల్: కలివరంలోని దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



నరసన్నపేట: సంతోషిమాత ఆలయంలో అమ్మవారి దర్శనం చేసుకుంటున్న భక్తులు



బూర్జ: బూర్జ శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



సారవకోట: గొర్రిబందలో సంతోషిమాత అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

నేడు మండల సమావేశం

పొందూరు: ఈ నెల 9వ తేదీన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ ఎం.మన్మధరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కిల్లి ఉషారాణి అధ్యక్షత వహిస్తారన్నారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి స్థాయి సమాచారంతో హాజరుకావాలన్నారు. జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొనాలని కోరారు.

మార్కెట్‌లో రాఖీల సందడి



మెయిన్ రోడ్డులో రాఖీలు కొనుగోలు చేస్తున్న దృశ్యం



కాలేజీ రోడ్డు కూడలిలో రాఖీలు కొనుగోలు చేస్తున్న యువతులు

నరసన్నపేట: శ్రావణ మాసంలో వచ్చే రాఖీ పండగ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక. తమ సోదరులకు రాఖీలు కట్టి వారి ఆశీస్సులు పొందడం సోదరీమణులకు ఎంతో ప్రత్యేకం. రాఖీ పండగ శనివారం నిర్వహించనున్నారు. శుక్రవారం నరసన్నపేట మార్కెట్‌లో రాఖీలు కొనుగోలుకు యువతులు ఆసక్తి చూపారు. దీనికి తగ్గట్టుగా వ్యాపారులు కూడా పలు కూడళ్ల వద్ద ప్రత్యేక షాపులు పెట్టి రకరకాల రాఖీలు అమ్మకానికి ఉంచారు. దీంతో మెయిన్ రోడ్డుతో పాటు కాలేజీ రోడ్డులో సందడగి నెలకొంది.

అనధికార లే అవుట్లలో..
ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం

ఆమదాలవలస: పురపాలక సంఘం పరిధిలో అనధికార లేఅవుట్లలో ప్లాట్ల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి శుక్రవారం తెలిపారు. 2025 జూన్ 30వ తేదీ లోగా రిజిస్టర్ అయిన అనధికార లే అవుట్లలోని ప్లాట్లు 2025 జులై 26 నుంచి 2025 అక్టోబర్ 24 వరకు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పురపాలక సంఘ పరిధిలో అనధికార లే అవుట్ల యజమానులందరూ క్రమబద్ధీకరణ కోసం ఎల్ఆర్ఎస్ పోర్టల్ (https //dtcp.ap.gov.in/L-Q/) లో నేరుగా సిటిజన్ లాగిన్ నుంచి, ఆమదాలవలస పురపాలక సంఘంలో లైసెన్స్‌పొందిన ఏటీపీల ద్వారా నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్నవారు ఓపెన్ స్పేస్ చార్జీలపై 50% రాయితీ పొందుతారని, 45 రోజుల లోపు మొత్తం ఫీజు చెల్లిస్తే.. పెనాల్టీ చార్జీలపై 10 శాతం తగ్గింపు ఉంటుందని, 90 రోజుల్లోగా మొత్తం ఫీజు చెల్లిస్తే పెనాల్టీ చార్జీలపై ఐదు శాతం తగ్గింపు పొందవచ్చన్నారు. 4 వేల చదరపు మీటర్ల లోపు విస్తీర్ణం గల వ్యక్తిగత స్థలాలు, ప్రభుత్వ రహదారి ఇప్పటికీ ఉన్న రహదారి సదుపాయం కలిగి, అనధికార లే అవుట్లలో భాగం కానట్లయితే వాటిని కూడా క్రమబద్ధీకరించుకొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. పైన తెలిపిన రాయితీలను కూడా పొందవచ్చన్నారు. అనధికార లే అవుట్ల ప్లాట్లను క్రమబద్ధీకరించకపోతే అటువంటి వాటిని నిరంతర నేరంగా పరిగణించి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనధికార లే అవుట్ల ప్లాట్లకు విద్యుత్, తాగునీటి సరఫరా, డ్రైనేజీ, తదితర వసతులు, భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయబడవని, రిజిస్ట్రేషన్ శాఖ నిషేధిత ఆస్తుల జాబితాలో నమోదు అవుతాయని, క్రయ విక్రయాలు, ఇతర లావాదేవీలు జరపడం సాధ్యపడవన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే హెల్ప్ డెస్క్ నంబర్ 9849906976ను, పురపాలక సంఘ కార్యాలయ పని వేళల్లో సంప్రదించాలని కోరారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న లక్ష్మణరావు

పాతపట్నం: మండలంలోని తెంబూరు గ్రామంలోని సత్యసాయి మందిరం వద్ద సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను సత్యసాయి సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛమైన తాగునీరు లేక ప్రజలు రోగాల పాలవుతున్నారన్నారు. అందువల్ల తక్కువ ధరకే ప్రజలకు మినరల్ వాటర్‌ను అందించనున్నామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో సత్యసాయి కమిటీ సభ్యులు బోయిన చంద్రమౌళి, సర్పంచ్ బెనియా వెంకటరమణ, రమేష్, కన్వీనర్ కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.